# నేటి చరిత్ర

సుశీలని వాళ్లమ్మ కొట్టింది. ఎందుకంటే పొయ్యిదగ్గర మూత పెట్టి వుంచిన ఆలుగడ్డ ముక్కలు అన్నీ తినేసి నాలుగే మిగిల్చిందని. "కూరముక్కలు తమ్మునికి లేకుండ నువ్వు మింగినావు ఎందుకే? మగపిల్లగాడు అని కూరసేస్తే అది నీ పొట్టన పెట్టుకున్నవె!" అని గంటసేపు తిట్టి, కోపం ఆగక, వంచి వీపు మీద గుద్దులు వేసింది. "పప్పుసారు లేదూ? పచ్చి తొక్కులేదూ, సాలదా?" అని యింకా తిట్టింది. సుశీలకీ పదహారేళ్లు. ఇంత బారున ఎదిగింది. తొమ్మిది చదువుతోంది.

సుశీల అయ్య, అమ్మ కూలిపని చేస్తున్నా బిడ్డల్ని చదువిస్తున్నారు. మగపిల్లవాడు ఏడు,సుశీలకి మంచి మార్కులే వస్తున్నాయి. ఎంతోసేపు ఏడిచింది కుక్కి మంచంలో కూచుని సుశీల. బయటికి వచ్చి సాయంత్రం ఎండలో నడుచుకుంటూ పోయి బావికాడ జామచెట్టు కిందికి చేరింది. పైకి చూస్తే దోరగా వున్న కాయల గుత్తి కనబడింది. మామూలుగా అయితే ఆ చెట్టుకి పిందెలు కూడా వుంచరు పిల్లలు. కానీ యీవేళ ఆకులచాటున లేత ఆకుపచ్చరంగులో కాయలు కనబడ్డాయి. పరికిణీ ఎగ్గట్టుకొని సుశీల నాలుగు కొమ్మలు ఎక్కి ఆ కాయలు తుంపుకొంది.

కింద బావి కాడ ఎవరో కదిలారు. భయంగా కిందకి దిగేసి, ఓణీలో కాయలు మూడూ పడేసుకుని బావి గట్టుపక్కని నక్కి కూచుంది. ఆత్రం ఆపుకోలేక గబగబ కాయ ఒకటి కొరికి తినేసింది. ఆ పక్కన కదలిన మనిషి రానే వచ్చాడు.

సైకిలు షాపు మనిషి మల్లేశు. వాళ్ల షాపులో పత్రికలు అమ్ముతారు. సుశీల బస్సుకోసం నిలబడ్డప్పుడు ఆ పత్రికలోని రంగుల బొమ్మలు చూసేది. మల్లేశుగానీ, మరో కుర్రాడుగానీ వుంటే పత్రికలు తెరిచి సినిమా బొమ్మలు చూడనిచ్చేవారు.వళ్లంతా కళ్లు చేసుకుని,ఆశగా ఆ బొమ్మలకేసి చూసేది. అల్లా పరిచయం మల్లేశు.

"ఆకలౌతుందా? చెట్టెక్కి కాయలు తెంపుకున్నావ్?" అన్నాడు మల్లేశు. నోట్లోని కాయ ముక్కలు మింగేసింది. ఒళ్లోనుంచి ఒక కాయ తీసి, "తిను, తియ్యగుంది" అన్నది. సుశీల మంచి రంగు వుంటుంది. ఇందాక ఏడిచినందుకు ముఖం ఉబ్బిపోయి ఎర్రబడింది. "ఏడిచినావా"" అన్నాడు కాయ కొరికేస్తూ,నమిలి మింగేస్తూ.

తలవంచుకుంది సుశీల. ఇంకో కాయ వళ్లోవున్నాగానీ తినబుద్ధికావడం లేదు. "మా అమ్మకొట్టింది" అన్నది. నమలడం ఆపేసి మల్లేశు ఆశ్చర్యంగా "ఇంత పెద్ద పిల్లని, నిన్ను మీ అమ్మకొట్టిందా? ఎందుకు?" అన్నాడు.

మెల్లిగా చెప్పింది సుశీల. కూరముక్కలు తింటే కొట్టిందని విని నిజంగానే ఆ క్షణానే మల్లేశు జాలిపడ్డాడు.

"నేనొక మాట చెబుతా, వింటావా?" సుశీల తలూపింది.

"మా పెద్దమ్మబిడ్డ సిటీలో ఒకరింట్లో కొలువుచేస్తోంది. నెలకి వెయ్యిరూపాయలిస్తారు. తిండి పెడతారు. ఎంతహాయిగా వుందో. ఆరే పెళ్లికూడా చేస్తామన్నారు. వాళ్లదోస్తులింట్లో అదే ఫ్లాట్‌లలో నీకు కొలువు యిప్పిస్తా వస్తావా?" అన్నాడు.

"పది అయినాక కదా కొలువు?" అన్నది సందేహంగా.

"పిచ్చిపోరీ! ఈకొలువుకి పదీ వద్దు, యిరవై వద్దు. ఐనా డిగ్రీ చదివిన వాళ్లకే కొలువులు లేవు. నువ్వు ఎంత చదివినా అంతే" అన్నాడు మల్లేశు.

"మా అయ్య ఒప్పుకోడు" అన్నది. "మీ అయ్య ఒప్పుకోడు, అమ్మఒప్పది. ఒప్పక పోయినా తిడుతుంటరు, కొడుతుంటరు. కూర తినేందుకు కూడా నీకు లేకపాయె – ఆళ్ల యిండ్లలో బిర్యానీలు,స్వీట్లు తిన్నంత తిండి. కారులో ఏడకైన పోతుంటే తీస్కపోతరు".

సుశీల ఆలోచిస్తోంది. ఇంట్లోంచి పారిపోవాలి. చెప్పకుండా ఎల్లిపోవాలి. గుండె పగిలి ఏడవదా అమ్మ!

"ఏంటి ఆలోచన, అమ్మపెట్టదు. అడుక్కుతినానివ్వదు. మూడు నెలల్లో నీవు మూడు వేలు పంపితే, ఆళ్లే సంతోషపడిపోతారు. నువ్వు సరేనంటే శుక్రవారం సాయంత్రం వెళ్లిపోదాం. నేను నిన్ను అక్కడ చేర్పించి వస్తాను.

సుశీలకి చాలా భయం కలిగింది. కానీ యీ తిట్లు, దెబ్బలు లేకుండా బంగళాల్లో, కార్లలో తిరగవచ్చునంటే, అదేదో ఆశగానే వుంది. కానీ 'సరే' అనలేకపోతోంది.

"ఎప్పటికీ యీ వూళ్లో వుంటావా? మీ అయ్య నీకు కాలేజీ చెప్పిస్తాడా? పైసలు ఎక్కడివి? పెళ్లి చేయాలంటే కట్నం పైసలు ఏడనుంచి తెస్తాడు? ఒక్క ఏడాది పనిచేసినావంటే నీకు నలభైవేలు దొరుకుతాయి" అంటూ వూహల్లో పల్లకీ ఎక్కించేశాడు మల్లేశు.

తన వూరికొంప, కూరవుంటే పప్పులేక, బియ్యం వుంటే కిరసనాయిలు లేక, వానాకాలంలో బట్టలు ఆరక, తడిబట్టలతో గడుపుకునే పేదరికం – యివన్నీ తలుచుకుంటే మల్లేశు చెబుతున్న కొలువు ఎంత బాగుందని!

రెండు మూడు రోజుల్లో ఆ చిన్న హృదయం ఆశలతో విచ్చుకున్నది. కొత్త జీవితం కలల్లో అనుభవిస్తూ, సిటీలో వున్నట్లే ఆ సుఖం అనుభవించేసింది.

శుక్రవారం మునిమాపువేళ బస్సు ఎక్కేసింది. ఎవరూ పసిగట్టకుండా, ఎల్లా బయలుదేరిందో! మల్లేశు పెద్దమ్మ నిజంగానే సిటీలో వుంది. ఆమె బిడ్డ నిజంగానే కొలువు చేస్తోంది. కాకపోతే,మల్లేశు ఒక్కపూటే అక్కడ వుండనిచ్చాడు. హైదరాబాదులో కాదు నీ కొలువు, బొంబాయిలో అన్నాడు. బొంబాయి రైలు ఎక్కించాడు. ఎవరో తెలియని వాళ్ళతో ప్రయాణం.

మల్లేశు, పెద్దమ్మ, కొలువు అన్నీ గాలిలో కలిసిపోయాయి. పెద్ద మీసాల గూండాతో కలిసి బొంబాయి చేరింది సుశీల. అమ్ముడుపోయింది. "సు" అనే అక్షరం తీసేసి 'శీలము' కూడా తీసేసిన తోలు బొమ్మ అయింది ఆ పిల్ల. చిన్న చిన్న రూములు, కర్టెన్లు కస్టమర్లు, 'ఘర్‌వాలీ' దయను బట్టి ఆదరణ. తిండి, మంచి బట్టలు. రెండు బక్కెట్ల నీరు, సబ్బులు, జబ్బులు రాకుండా మందులు, లోషన్లు, ఆయింటుమెంట్లు కస్టమర్ల కోసం కండోములు.

ఇల్లా గడుస్తోంది జీవితం. సుశీల ఆ సుడి గుండంలో పడిపోయింది. అవస్థ పడింది. గింజుకుంది. ఎదురుతిరిగింది. తెలివి తెచ్చుకుంది. తన తోటి ఆడపిల్లలు నిప్పులో పడిన పురుగులైపోయినారు. వారి జీవితాలు మాడి మసి అయినాయి.

ఆరు, ఎనిమిది చదరపు అడుగుల చిన్న రూములు, గాలి చొరని యిరుకు గదులు, అందులో మంచాలు, శృంగారం. రోజుకి నలుగురైదుగురు కష్టమర్లు. అసహ్యానికి చోటులేదు. విసుగు పుట్టడానికి వీలులేదు. మనిషిగా తల ఎత్తడానికి మార్గం లేదు.

అంతమందిలోనూ  సుశీల ఒక ప్రత్యేకమైన పిల్లగా తయారయింది. కొందరిని ప్రత్యేకంగా ఆకట్టుకుంది. 'ఘర్‌వాలీ' చిన్న పనులకి వీథిలోకి కూడా పంపడం మొదలెట్టింది. సుశీల చదువుకున్నది, తెలివిగలది, డబ్బు విషయంలో నమ్మకస్తురాలు అని విశ్వాసం కలిగించింది. ఒక ఏడాది గడిచింది. ఆ కుళ్లులో, ఆ దోపిడిలో సుశీల దగ్గరికి వచ్చేవాళ్లలో ఒక తెలుగు ఆయన తారసపడ్డారు. బట్టల వ్యాపారం కోసం ముంబాయి వస్తుంటాడాయన.





సుశీల ఆయనతో స్నేహం పెంచుకుంది. ఆమె రూపురేఖలు నచ్చడమే కాక లోకజ్ఞానంతో మాట్లాడే మాటలు కూడా నచ్చాయి. సుశీల ధైర్యంగా వున్నాగానీ దు:ఖపడింది. తన బతుకు యిల్లా వీధి పాలైనందుకు కుమిలి ఏడిచింది. అమ్మ, అయ్య గుర్తుకొచ్చి వాళ్లెన్ని  మాటలు పడ్డారో అందరి చేతా అని విలవిలలాడింది. తమ్ముడికీ తనంటే ప్రాణం. మీ అక్క యేదిరా అంటే ఏం చెప్పాడో!

ఈ సమయంలో బట్టల వ్యాపారం మీద నెలకు వారం రోజులు ముంబాయి వచ్చి సుశీల కోసమే వస్తోన్న సుబ్బారాయుడు 'ఘర్‌వాలీ'కి నమ్మకస్తుడుగా తేలాడు. ఒక మూట చీరెలు తూకంతో కొన్నవి తెచ్చి ఒకసారి పడేశాడు. దాంతో ఘర్‌వాలీకి గొప్ప అభిమానం పుట్టింది.

సుబ్బారాయుడు మనసున్న మనిషి. సరదాకి, యీ ఆడబొమ్మలతో ఆడుకుందామని వచ్చాడు గానీ, సుశీల లాంటి వ్యక్తిత్వం, అమ్మ, అబ్బమీద మమకారం, తనవూరు, తన భాష. స్కూలు గురించి జ్ఞాపకాలు పచ్చిగా వున్న పిల్ల - అతడిని ఆకట్టుకొంది. ఆమె నిజంగానే మోసపోయింది. ఎయిడ్స్, రోగాలతోనో, మందుల మధ్య, పోలీసుల చేతుల్లో, గూండాల్లాంటి విటుల చేతుల్లో ఆమె లాంటి లేతపువ్వు జీవితం అంతమౌతుందంటే అతనిలో ఏదో ఒక నరం కదిలింది.

కొన్ని బిస్కెట్లు, సెంట్లు దుప్పట్లు అవీ కావలసి వచ్చాయి. అనుకోకుండా ఆ పగటి పూటే సుబ్బారాయుడు వచ్చాడు అక్కడికి. కొనడానికి సుశీలకి అతడిని తోడు యిచ్చి ఎంతో నమ్మకంతో ఘర్‌వాలీ పంపించింది.

ఆటోలో వెళ్లినవాళ్ళు ఎప్పటికీ రాలేదన్న సంగతి గంటన్నర తర్వాత గానీ ఘర్‌వాలీకి గుర్తుకి రాలేదు. కంగారుగా తిరిగింది. రెండతస్తుల ఆ మేడలో వెతికింది. సుశీల బట్టల బ్యాగు కూడా లేదని అప్పుడు తెలిసింది. అందరూ ఎదురు చూస్తున్నారు.

మామూలుగా అయితే కొందరు మగవాళ్లని దగ్గర్లోని స్టేషను, బస్సు, ఆటో స్టాండులకి పంపిస్తుంది. పారిపోయిన అమ్మాయిలను వెతకడానికి. అల్లాగే చేసింది. కానీ సుబ్బారాయుడు ఎంతో చురుగ్గా ఆటోని వూరిపొలిమేరలు దాటించేశాడు. ఎవ్వరూ వెతికి పట్టుకోలేనంత దూరం వెళ్ళిపోయారు.

వస్తువులు కొనడానికి తెచ్చిన డబ్బుల్లో ఒక మూడు వందలు అయిపోయినాయి. రైల్లో ఎక్కించాడు సుశీలని. అందుకు సరిపోయింది ఆ డబ్బు. చేతులు జోడించి నమస్కారం పెట్టింది సుశీల. కళ్లనిండా నీళ్లు. సుబ్బారాయుడు అనే కరుణామయుడు ఆవిధంగా పుణ్యం కట్టుకొన్నాడు. ఆదర్శవాది కనుక ఆపని చేశాడు.

సుశీల ఎక్కడికి వెడుతుందిప్పుడు? తెల్లవారుతోంటే రైలుదిగింది. స్టేషనులోనే శుభ్రపడి మంచి బట్టలు వేసుకొంది.

ఇంటికి వెళ్లింది. ఏమీ జరగనట్లు, సినిమా డాన్సుకోసం వెళ్లాననీ, దొరకలేదనీ, వచ్చేశాననీ గుక్కతిప్పుకోకుండా కథ చెప్పేసింది. ఇంట్లో వాళ్లు నమ్మినా నమ్మకపోయినా, బయటివారు చాల్లే నీ బొంకులు అన్నట్టు చూసినా లెక్కచేయలేదు.

ఆమెకు ఒక షాపులో ఉద్యోగం దొరికింది. ఆకర్షణగా, అందరినీ ఆకట్టుకునే నేర్పు సంపాదించింది కనుక, ఉద్యోగంలో బాగానే నిలదొక్కుకుంది. ఇది వరకు లాగా బేల కాదు. సందేహంగా,భయంగా ఎవరివంకా చూడదు. ముంబాయి జీవితం నేర్పిన పాఠాలు అన్నీ యిన్నీకాదు. వందరూపాయల నోట్లు చూస్తే భయపడదు. ఎవరైనా చులకనగా, చవుకగా చూస్తే బెంబేలు పడదు.

తనబోటి వాళ్లను రక్షించాలని నిర్ణయం చేసుకొంది. అందుకోసం విజయవాడలో వున్న సెంటరుకి వెళ్లివస్తుంది. స్వతంత్ర జీవనం. ఇంట్లో డబ్బులు యిస్తుంది. వచ్చినప్పుడు వస్తుంది. పోయినప్పుడు పోతుంది అని యింట్లో వాళ్లకీ అర్థమైంది.

సుశీల నమ్మినది, మనసారా మొక్కుకునేది ఒకే ఒక్క దైవాన్ని, అతను సుబ్బారాయుడు. తిరిగి ఎన్నడూ కలుసుకోకపోయినా మరపురాని మనిషి అతను. ఇప్పుడు ఆమె 'ఖుషీ' అనే చిన్న పేరు తగిలించుకుంది. విజయవాడ మహిళా సెంటరులో అందరూ అల్లాగే పిలుస్తారు. సుశీల అంటే నవ్వుతుంది. ఆ పేరుకి అర్థం తెలుసు కనుక. 'ఖుషీ' అని ఎందుకంటే ఎందరికో 'ఖుషీ' యిచ్చేదానను కనుక అంటుంది.

ఎప్పటికైనా తను ముంబాయి వెళ్లాలి. ఏదో రస్తా వేసి కొందరు అమ్మాయిలనైనా రక్షించాలి. ఇరుకుగదుల్లో బతుకుని కరిగిపోయే కొవ్వొత్తిలా తగులబెట్టుకుంటున్న తన బోటి వారిని ఆ కూపంలోంచి బయటపడేయాలి. సెక్సువర్కర్లుగా వున్న వాళ్లని వేరే దారిలో పడండర్రా అని బోధించాలి.

అందుకు కంకణం కట్టుకున్నానంటుంది నిండా పాతికేళ్లులేని ఆ యువతి. ఇది నేటి చరిత్ర. రేపటి కథ ఎల్లా వుంటుందో – యీ సమాజం చెప్పాలి.

**(వాస్తవ గాథ)**